అలివ్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స జరిగిన పేషంట్‌తో పాటు వైద్యులు

గోల్కొండ: అలివ్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో మేనేజింగ్ డైరెక్టర్ ముజాహిద్ హుస్సేన్ వెల్లడించారు. అనారోగ్యంతో కొన్ని రోజుల క్రితం ఓ 26 ఏళ్ల వ్యక్తి ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చాడు. కాగా అతడికి వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఫోకల్ లోడ్యూయర్ హైపర్ ప్లాసియా వర్సెస్ ఫైబ్రోలా మెల్లార్ వెరియంట్ ఆఫ్ హెపాటోసెల్యూలర్ కార్సినోమాతో పాటు పిత్తాశయంలో రాళ్లతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ రాధాకృష్ణన్ రోగి కేసును బాగా లోతుగా స్టడీ చేశారు. అనంతరం అతడికి అవసరమని సిఫారసు చేశారు. నిపుణులతో కూడిన వైద్యుల బృందం రోగికి లెఫ్ట్ లాటరల్ సెగ్మెంట్ టెక్టమి కోలిసి ఫెక్టమి విధానంలో శస్త్ర చికిత్స చేశారు. శస్త్ర చికిత్సలో భాగంగా పేషంట్ పూర్తి ఆరోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్నాడు.

ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ



ఇన్వెస్టిచర్ సెర్మనీలో విద్యార్థినులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్వెస్టిచర్ సెర్మనీ–2024 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి 2024 సంవత్సరానికి ఎన్నికైన స్టూడెంట్ ప్రతినిధులచే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. జీఎన్ఐటీఎస్‌లో విద్యనభ్యసించిన యువతులు నేడు దేశంలోని అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. 2024 విద్యా సంవత్సరానికి స్టూడెంట్స్ కౌన్సిల్ అధ్యక్షురాలిగా జి.హర్షిత, ఉపాధ్యక్షురాలిగా సాత్వీక, ప్రధాన కార్యదర్శిగా శ్రద్ధారావు మాధవరం, జాయింట్ సెక్రటరీగా దొడ్డి శ్రేయా, కల్చరల్ సెక్రటరీగా పి.రిషికారెడ్డి, కల్చరల్ జాయింట్ సెక్రటరీగా ఎం.చిన్మయి, సాంకేతిక కార్యదర్శిగా శ్రేయారెడ్డి, టెక్నికల్ జాయింట్ సెక్రటరీగా తన్మయి ఆలా, స్పోర్ట్స్ సెక్రటరీగా లక్ష్మి మహతి, ఫైనాన్స్ కార్యదర్శిగా గౌతమిరెడ్డి, ఎడిటరింగ్ చీఫ్‌గా అక్షరారావు అన్నమనేని, అసిస్టెంట్ ఎడిటర్‌గా హర్షిత, పీఆర్ అండ్ సోషల్ మీడియా హెడ్‌గా శ్రీవైష్ణవి ఏలూరి, మార్కెటింగ్ అండ్ బ్రాండింగ్ హెడ్‌గా శ్రీమహితలు ఎన్నికయ్యారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకం'



బీజేపీ రైతు ధర్నాకు తరలివెళ్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకం అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన కిసాన్ దీక్షకు ఆయన తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ.. ఉత్తుత్తి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. హైడ్రా అంటూ భవనాలను కూల్చడం, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూడ్చమే కాంగ్రెస్ పని అని ప్రశ్నించారు. నామా యాదగిరి, ప్రభు పూజారి తదితరులున్నారు.

మత్స్యకారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



గన్‌ఫౌండ్రీ: మత్స్యకారులకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నివిధాల సహకారాలు అందిస్తుందని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు మత్స్యకారులు నరకం చూశారన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావడంతో మత్స్యకారులంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి మత్స్యశాఖ మార్కెట్లను పరిశీలించారు. గతంలో మూతపడిన మూసాపేట్ ప్రభుత్వ చేపల మార్కెట్‌ను వెంటనే తెరిపించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన మత్స్యకారులందరికీ దుకాణాలను కేటాయించి వారిని ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఆలయ చైర్మన్‌కు సత్కారం



నరేందర్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నేత వెంకటేష్

నాంపల్లి: శ్రీ సీతారామ్‌చందర్‌జీ హనుమాన్ ఆలయం చైర్మన్‌గా నరేందర్ బాధ్యతలు స్వీకరించారు. కోశాధికారి చేతన్ శర్మ, ప్రధాన కార్యదర్శి సీమ పాండు, సభ్యులు కె.సంజయ్‌కుమార్, రవి కుమార్, శ్రీనివాస్, జె.అనంతలక్ష్మిలతో కలిసి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ.. సహకరించిన నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి మహ్మద్ ఫిరోజ్ ఖాన్, స్థానిక కాంగ్రెస్ నేత జి.వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఆలయ నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్ ముదిరాజ్, ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



మహంకాళేశ్వర అమ్మవారు



ధూల్‌పేట్‌లో మాతేశ్వరీ విగ్రహాలను కొనుగోలు చేస్తున్న మండపాల నిర్వాహకులు

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 3 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు
- అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయాల నిర్వాహకులు

చార్మినార్: శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మీరాలంమండిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత సేవ, మహాభిషేకం, అలంకరణ, చతుషష్టి ఉపచార మహాపూజ, 10 పారాయణంలు, ఛండీహోమం, పూర్ణాహుతి, నైవేద్యంతో పాటు సాయంత్రం 5.30 గంటలకు సామూహిక సహస్రనామ కుంకుమార్చన ఉంటుంది. సాయంత్రం 6.30 గంటలకు సహస్ర దీపోత్సవం, ఊంజల్ సేవ, రాత్రి 8.05 గంటలకు పంచహారతి, సామూహిక హారతి, గౌరిపూజ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. 9 గంటలకు అన్నప్రసాదంతో పాటు రాత్రి 11.35 గంటలకు అమ్మవారికి ఏకాంత సేవ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి.

సుప్రభాతంతో ఉత్సవాలు ప్రారంభం

3వ తేదీన ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మహాభిషేకం, అఖండ జ్యోతి, శతఛండీ సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశనం, ఋతిగ్వర్ణనం, సర్వతోభద్ర మండపరాధన, అంకురారోహణం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

రోజుకో అలంకరణ..

3న బాలత్రిపుర సుందరీ దేవి, 4న గాయత్రి దేవి, 5న అన్నపూర్ణ దేవి, 6న లలితా త్రిపుర సుందరీదేవి, 7న మహాచండీ దేవీ, 8న మహాలక్ష్మీ దేవీ, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని దేవి, 12న రాజారాజేశ్వరి దేవి తదితర రూపాల్లో అమ్మవారికి విశేషాలంకరణ చేయనున్నారు. ఈ 10 రోజుల్లో ప్రతిరోజూ 10 పారాయణంలతో పాటు ఛండీ హోమం నిర్వహించనున్నారు. 12న ఆయుధ పూజ, తిరువీధి సేవలతో పాటు రావణ దహనం, షమ్మి పూజ, తదితర కార్యక్రమాలు ఉంటాయి.



తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు ఉమేష్

అన్ని ఏర్పాట్లు చేశాం..



నగరంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలను నిర్వహించనున్నాం. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల సందర్భంగా పలువురు సినీ ప్రముఖులతో పాటు అధికార, అనధికార ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

– గాజుల అంజయ్య, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్

విగ్రహాల తయారీలో నైపుణ్యం కావాలి..



మాతేశ్వరీ విగ్రహాల తయారీలో ఎంతో నైపుణ్యం కావాలి. ముఖ్యంగా ముఖ తేజస్సు, ఆభరణాలు, వస్త్రాలు, రంగులు అద్దడంలో ఎంతో నేర్పుగా చేయాల్సి ఉంటుంది. విగ్రహాల విక్రయాలు కొనసాగుతున్నాయి.

– గణేష్ సింగ్ ఫైనార్ట్స్ నిర్వాహకుడు

ధూల్‌పేట్‌లో దుర్గా మాత విగ్రహాలు రెడీ

అబిడ్స్/జియాగూడ: ధూల్‌పేట్ కళాకారుల చేతుల్లో దేవీ మాతేశ్వరీ వివిధ రూపాల్లో విగ్రహాలు ఎంతో కళాత్మకంగా రూపుదిద్దుకుంటున్నాయి. అక్టోబర్ 3 నుంచి దేవీ శరన్నవరాత్రి ప్రారంభం కానున్న సందర్భంగా ధూల్‌పేట్‌లో మండపాలా నిర్వాహకులు విగ్రహాలను సిద్ధం చేసి విక్రయాలు చేపట్టారు.

వివిధ రూపాల్లో మాతేశ్వరీ..

ధూల్‌పేట్‌లో మాతేశ్వరీ విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేస్తారు. ముఖ్యంగా దుర్గాదేవి, కాత్యాయనీ, సింహవాహిని, త్రిషూల దారిని, పార్వతి దేవి, మహిషాసుర మర్దిని, కామాక్షి దేవి, నాగస్వరూపిణి, పరబ్రమ్మ స్వరూపిణి, కలకత్తా కాళీకాదేవి తదితర రూపాల్లో విగ్రహాలు తయారు చేస్తారు.

ఉత్తర భారతీయులు భారీగా కొనుగోళ్లు..

విగ్రహాలు ఒక ఫీట్ నుంచి 20 ఫీట్ల వరకు అందుబాటులో ఉన్నాయి. వెయ్యి రూపాయాల నుంచి లక్ష వరకు ధరలలో వివిధ ఎత్తుల్లో లభిస్తాయి. శరన్నవరాత్రి వేడుకలు ఆలయాలతో పాటు బస్తీలలో మండపాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తారు. ముఖ్యంగా ఉత్తర భారతీయులు మాతేశ్వరీ మండపాల వద్ద పూజలతో పాటు అన్నప్రసాదాలు, యువతులు దాండియా, గర్బ, మాతా జాగరణ, చౌకి తదితర కార్యక్రమాలు భక్తి పారావశ్యంలో ముంచెత్తుతాయి.

3 నుంచి జియాగూడ మహంకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు

జియాగూడ: జియాగూడ మహంకాళి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గౌడుగు ఆంజనేయులు ముదిరాజ్, ఆలయ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతిరోజు అమ్మవారికి ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, హోమం, హారతి, సాయంత్రం కుంకుమార్చన, రాత్రికి అఖండ హారతి, పల్లకి సేవా, ప్రసాద వితరణలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం జియాగూడ మహంకాళి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతాయి. సలహాదారులు పి.బాలకృష్ణ, ఎ.బాలకృష్ణ, అప్పారావు శాస్త్రీ, భరద్వజశాస్త్రి పంతులుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు జరుగుతాయి.

'డీజేకు అనుమతులు లేవు'



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

విజయనగర్‌కాలనీ: చెవులకు హాని కలిగించే డీజేకు అనుమతులు లేవని ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గామాత మండప నిర్వాహకులు, ఫంక్షన్‌హాల్ నిర్వాహకులతో పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుర్గామాత మండం వద్ద, ఫంక్షన్‌హాళ్లల్లో డీజే శబ్దాలను నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ తేజ, హైమ, మండప, ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా ఉదయ్ ఓమ్ని స్వర్ణోత్సవం

గన్‌ఫౌండ్రీ: అబిడ్స్‌లోని ఉదయ్ ఓమ్ని హాస్పిటల్ 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకలను సోమవారం అబిడ్స్‌లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ వేదప్రకాష్ మాట్లాడుతూ..1974లో ఉదయ్ క్లీనిక్‌గా ప్రారంభమై నేడు ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి పేషంట్‌కు మెరుగైన వైద్యంతో పాటు అతని సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాఘవ దత్త్, డాక్టర్ ఉదయ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సినారె రచనలు స్ఫూర్తిదాయకం



చెన్నారెడ్డిని సత్కరిస్తున్న పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు శివారెడ్డి, చెన్నయ్య

సుల్తాన్‌బజార్: డాక్టర్ సి.నారాయణరెడ్డి కవిత్వం చదివి ఆ స్ఫూర్తితో తెలుగు సాహిత్యాల వైపు వచ్చానని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జి.చెన్నకేశరెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహిస్తున్న పరిణత వాణి ప్రసంగ పరంపరలో ఆయన సోమవారం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామాంజునరావు కళామందిరంలో ప్రసంగించారు. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ విద్యార్థులకు అవసరమైన అంశాలు పాఠ్య ప్రణాళికలో తక్కువగా ఉంటున్నాయని తెలిపారు. చెన్నకేశరెడ్డి గేయ సాహిత్యంపై రచించిన గ్రంథం మాత్ర చందస్సు గురించిన అవగాహన కలిగిస్తుందని తెలిపారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, ప్రాశ్య కళాశాల ప్రధానాచార్యులు ఎ.సిల్మానాయక్, అమ్మంగి వేణుగోపాల్, టి.గౌరిశంకర్, నందిని సిద్దారెడ్డి, ఏనుగు నర్సింహారెడ్డి, శ్రీ వసుంధరరెడ్డి పాల్గొన్నారు.



టీఎన్జీఓస్ వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ రహ్మాత్ అలీ కుమార్తె వివాహ నిశ్చితార్థ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్‌అలీ షబ్బీర్, ఆర్టీఏ యాక్టివిటీస్ అజితొహిందుజ పాల్గొన్నారు. నూతన వధువరులను ఆశీర్వదించారు. – అబిడ్స్

మూసీ పాత సర్వేను అమలు చేయాలి



ఆర్‌డీవో, తహసీల్దార్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మూసీ పరివాహక ప్రాంతంలో 2003లో నిర్వహించిన సర్వే ప్రకారం ఇళ్లను మార్కు చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫేకర్ అలీ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే ముబిన్‌తో కలిసి గోల్కొండ తహసీల్దార్ కార్యాలయంలో హైదరాబాద్ ఆర్‌డీఓ మహిపాల్, గోల్కొండ తహసీల్దార్ అహల్యతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2003లో సర్వే నిర్వహించిన అప్పటి సర్వేయర్‌ను సంప్రదించాలని ఆ సర్వేయర్ సమర్పించిన రిపోర్టులను పరిశీలించాలని సూచించారు. కాగా ప్రస్తుతం మూసీ పరివాహక ప్రాంతంలో జరుగుతున్న సర్వేను ఆపాలని ఒక్క ఇంటిపై కూడా మార్కింగ్ చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న ఐఎంఎస్ జంగల్ సఫారీ ప్రదర్శన



అడవి జంతువుల వేషధారణలో విద్యార్థులు

జియాగూడ: అడవులను కాపాడుకుంటేనే వన్యప్రాణులు సురక్షితంగా ఉంటాయని ఇంద్రాణి మహావిద్యాలయ్ ప్రిన్సిపాల్ మిథిలేష్‌కుమార్ అన్నారు. సోమవారం జియాగూడలోని డోర్‌బస్తీలో గల ఇంద్రాణి మహావిద్యాలయ స్కూల్‌లో ఐఎంఎస్ జంగల్ సఫారీ ప్రదర్శన ఏర్పాటైంది. ఇందులో నర్సరి, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల విద్యార్థులు అంతరించి పోతున్న పది రకాల అడవి జంతువుల వేషధారణలతో అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ..ఇప్పటికే అడవిలో చెట్ల సంపదను నరకడం, నీటి నిల్వలు తగ్గడం వల్ల ఎన్నో జంతువులు అంతరించి పోతున్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ ఇంద్రాణి, ఇన్‌చార్జి శ్వేత, ఉపాధ్యాయులు శిరీష, మీనాక్షి, సరిత, మహేశ్వరి, అశ్విని, హేమలత, రాధిక, ప్రియాన్షు పాల్గొన్నారు.

కొలువుదీరిన నూతన పాలక మండలి



చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ లలితాంబ ఆలయం నూతన పాలక మండలి సోమవారం కొలువుదీరింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ, ఈవో పూర్ణచందర్ కమిటీ సభ్యులచే ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ చైర్మన్‌గా పి.రాహుల్, సభ్యులుగా ఎన్.వెంకటేష్ యాదవ్, టి.అనిల్ సింగ్, పి.కిరణ్ కుమార్, లక్ష్మీబాయిలు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ..ప్రాచీనమైన లలితాంబ ఆలయ ప్రాశస్త్యాన్ని మరింత పెంపొందించే విధంగా కృషి చేస్తామన్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు అసౌకర్యాలు కలకుగండా సదుపాయాల కల్పనకు పాటు పడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజుయాదవ్, ఇ.ముత్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడమే బీజేపీ లక్ష్యం



మెడికల్ క్యాంపులో రఘునందన్‌యాదవ్, భీశ్వ సురేఖ, భీశ్వ ఓంప్రకాష్

అబిడ్స్: ప్రజాసేవ చేయడమే బీజేపీ లక్ష్యమని గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రఘునందన్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ సేవా పక్షంలో భాగంగా గన్‌ఫౌండ్రీ కమ్యూనిటీహాల్‌లో మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్ యాదవ్ మాట్లాడుతూ..బీజేపీ కార్యకర్తలు, నాయకులంతా ప్రతినిత్యం ప్రజల్లో ఉండి సేవా దృక్పథంతో ముందుకుపోతారన్నారు. కార్పొరేటర్ సురేఖ మాట్లాడుతూ.. జీవితాంతం సేవ చేయడమే తమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ భీశ్వ ఓంప్రకాష్, ఉడ్‌లాండ్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సురేష్ గౌడ్, బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ సురేందర్, బీజేపీ నాయకులు నరహరి, కృష్ణ, రమేష్, వివేకానంద, దేవరాజ్ సోలంకి, సోను సింగ్, రాజేష్ కిశోర్ పాల్గొన్నారు.

సన్మానం



యాకుత్‌పురా: పదవీ విరమణ పొందిన జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ చాంద్రాయణగుట్ట సర్కిల్ ఏఎంసీ మోహన్ రెడ్డిని సోమవారం మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా అమన్‌నగర్–బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డీసీ సురేందర్, సీవిల్ కాంట్రాక్టర్ మహ్మద్ అయనుద్దీన్, ఏఎంసీ మోహన్‌రెడ్డి కుంటుంబసభ్యులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్



డాక్టర్ సయ్యద్ తౌహిద్ అహ్మద్

చాంద్రాయణగుట్ట: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని బండ్లగూడలోని అల్ ఆరీఫ్ జనరల్ హాస్పిటల్ అండ్ యునాని రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ తౌహిద్ అహ్మద్ సూచించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..వాతావరణ మార్పుల కారణంగా జలుబు, చలి, గొంతునొప్పి వస్తున్నాయని, కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా వాటిని నివారించవచ్చన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బయటి తినుబండారాలకు దూరంగా ఉంటూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధులు చల్ల నీటిని తాగరాదని ఉదయం, సాయంత్రం కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలన్నారు. ఎక్కువ అనారోగ్యానికి గురయితే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్ట్

సంతోష్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియా ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఓ వ్యక్తిని కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..హస్తినాపురం డీఆర్‌డీఎల్ కాలనీకి చెందిన సిద్దమోని నరేశ్ (25) సోషల్ మీడియా ద్వారా సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై న్యాయవాది అహ్మద్ అస్లాం ఉల్లా షరీఫ్ కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నరేశ్‌ను అరెస్ట్ చేశారు.

గంజాయి తాగుతున్న ఇద్దరికి జైలు

గౌలిపురా: గంజాయి తాగుతున్న ఇద్దరికి 15 రోజుల జైలు శిక్ష పడిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఫెరోజ్ (40), తలాబ్‌కట్టా రోడ్డు నంబర్–4 ప్రాంతానికి చెందిన మహ్మద్ మజ్హర్ (20) భవానీనగర్ స్టేషన్ పరిధిలో ఇటీవల గంజాయి తాగుతూ పోలీసుల కంటపడ్డారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని సోమవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతిరావు నిందితులిద్దరికి 15 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

దేవాదాయ భూములను పరిరక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బజరంగ్‌సేనా నాయకులు

సుల్తాన్‌బజార్: దేవాదాయ శాఖ భూములను పరిరక్షించాలని బజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం బజరంగ్‌సేనా బృందం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీలకు గోస్వామిమఠ్‌లో కబ్జాకోణంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..కొంత కాలంగా దేవాదాయ భూములను కబ్జాదారులు కబ్జాలు చేస్తున్నారని వాటిపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. గోస్వామి మఠం వద్ద కొంత స్థలం అన్యక్రాంతమైందని తెలిపారు. అంతేకుండా మఠం వద్ద జంతు వధలు నిషేధం ఉన్నా కొందరు యథేచ్ఛగా అక్కడ జంతు వధలు జరుపుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఎండోమెంట్ అధికారులు దేవాదాయ భూములను కబ్జాల నుంచి కాపాడలని కోరారు.

హిందీ భాషాభివృద్ధికి కృషి చేయాలి



హిందీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హిందీ ప్రచార సభ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: దేశ ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు హిందీ భాష ఎంతగానో దోహదపడుతుందని పలువురు వక్తలు అన్నారు. సోమవారం నాంపల్లి స్టేషన్ రోడ్డులోని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాషాభివృద్ధికి ఎనలేని సేవ చేస్తున్న పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. హిందీ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్, భగవంత్, హైకోర్టు న్యాయవాది వెంకట్‌రామ్, ప్రచార సభ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి, పరిక్షా సంచాలకులు ప్రొఫెసర్ సురేష్ పురి పాల్గొన్నారు.